# అనామకుడు

పాటిమళ్ల రామకృష్ణ

ప్రభాకరరావు ఒక కవి. ఈ కవిత్వం తనొక్కడిదే కాదు. తరతరాలనుంచీ వస్తున్నది. కానీ తన పూర్వీకులకు తనకు ఒక తేడావుంది. పూర్వీకులు తమ కవిత్వశక్తిచేత పెద్దపెద్ద జమీందారుల సత్కారాలు పొంది ఘనమార్జించారు. కాని ప్రభాకరరావు రోజులొచ్చేసరికి అవేమీ లేకుండాపోయాయి. అతనికి కవిత్వంలో అఖండమైన తెలివితేటలున్నాయి. అయితే యేం? అడవిని కాచిన వెన్నెలలావుంది.

ప్రభాకరరావు దురదృష్టమేమోగాని సరిగా జమీందారీలు రద్దయిన రోజుల్లో యీతడు పుట్టడం, తదనుగుణంగా తన పూర్వీకులు కూడా విచక్షణారహితంగా తమ స్వార్జితం తామే ఖర్చుపెట్టడం జరిగాయి. ఇక పోగా ప్రభాకరరావుకు మిగిలింది తమ వంశపారంపర్యంగా వస్తున్న కవిత్వం, ఒక చిన్న పెంకుటిలోగిలి, కాగా తన పెద్దలు మనసుపడి మోజుపడి ఏర్చికూర్చి అంటగట్టిన భార్యారత్నం.

ప్రభాకరరావు ఎన్నో పుస్తకాలు రాశాడు. ఆతడు రచనలలోగల వివిధ ప్రక్రియలన్నీ చేయగలిగాడు. కానీ వాటినెవరూ ముద్రించ సాహసించలేదు. "అబ్బే! ఆధునిక భావాలుగల పుస్తకాలు కావండీ!" అన్నారు ప్రకాశకులు. అయినా ప్రభాకరం అధైర్యపడలేదు. చిన్నచిన్నకథలు ఎన్నోరాశాడు. వాటినిమాత్రం పత్రికాధిపతులు ప్రకటించారు. అచిరకాలంలోనే పత్రికల ఆదరాభిమానాలు పొందాడు. కాని తనకు కావలసినది రానేలేదు. ఎప్పుడో ఏ ఎడిటరన్నా ఓ పదిరూపాయలు పంపేవాడు. వాటితోనే సంతృప్తిపడేవాడు ప్రభాకరం.

ప్రభాకరరావు కథలంటే పత్రికలుపడి చచ్చిపోయేవారు. ఆ గర్వంతప్ప ప్రభాకరరావుకు యింకేమీ మిగల్లేదు. నాలుగేళ్లక్రితం తన భార్యకు జబ్బుచేసిన ఫలితంగా ఉన్న ఆ కాస్త కొంపకూడ తణఖాలోపడి, తీర్చే అవకాశంలేక వడ్డీ పెరిగి, పెరిగి చివరకు ఆ యిల్లుకూడ తన దరిద్రావస్థను చూడలేక తన్ను వదిలేసింది. ప్రస్తుతం మూడు రూపాయల అద్దెతో ఒక పూరిగుడిసెలో వుంటున్నాడు. రోజులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పగలల్లా పిచ్చివానిలాగా తిరిగి తిరిగి రాత్రిళ్లు యింట్లో మిణుకుమిణుకుమని వెలిగే దీపిక గ్రుడ్డికాంతిలో ఏవేవో రాసేవాడు. భావగీతాలలో తన్నుతానే మరిచిపోయేవాడు. మళ్ళీ తనలో తాను తెలుసుకొని ఎదురుగా పనిచేసుకుంటున్న భార్య కట్టుకున్నచీర, ఆమెశరీరాన్నిసహితం పూర్తిగా కప్పలేకుండంచూచి దీర్ఘంగా నిట్టూర్పుతుండేవాడు. కాని అతనికి ఏవేవుమూలో ఆశ పీడిస్తుండేది. "ఎప్పటికయినా నువ్వో ఓ పెద్దకవి వవ్వచ్చు ఆస్థానకవివైనప్పుడు నీ దారిద్ర్యమంతా పటాపంచలు కావచ్చు" అని తన అంతరాత్మ అరుస్తున్నట్లూహించుకొనేవాడు. ఏమో! భవిష్యత్తు నెవరు నిర్ణయించగలరు?

మానవుడు దేనికి లొంగినాలొంగకపోయినా 'ఆశ'కుమాత్రం దాసుడుకాక తప్పదు. 'ఆశ' లేని మానవుడేలేడు. క్రుళ్ళి, క్రుసించి, చివికి, జీర్ణమై బజార్లలో తిరిగే కుక్కలతోపాటు పోరాడి, కాఫీహోటళ్లలోని ఎంగిలివిస్తళ్లతో జీవించేవారుసైతం 'కాలం' కోసం ఆశను ఎరగా పెట్టుకొని బ్రతుకుతున్నారంటే మానవుల్ని ఆశ ఎంతవరకు జయించిందో తెలుసుకోవచ్చును.

తనూ, భార్య ఉన్నంతకాలం, తిండి ఉన్నా లేకపోయినా ఎలాగో గడిచిపోయింది. కానీ తనకు పిల్లాడు పుట్టేసరికి గడవడం దుస్సహమైపోయింది. తన కథలు చదివి పొగిడేవారేగాని, తనస్థితిజూసి, తన నర్థం చేసికొని, సానుభూతి చూపి, ఆర్థికసహాయం చేసేవాళ్లెక్కరూలేరు. నెలకు ఏపత్రికనుండో ఏ పది రూపాయలో వస్తే ఏ మూలకది. ముగ్గురు బ్రతకాలి. ఎలాగు? తనలా కవిత్వం రాస్తూకూర్చుంటే సాగేట్టులేదు. ఏదో ఒక పని చేసి నాలుగు డబ్బులు సంపాదించాలి. తన భార్యా బిడ్డల్ని తను రక్షించుకోవాలి. ఈ సంఘంలో తనకు తాను నిలబడాలి. అంటే? ఈ కూడుపెట్టలేని వెధవ కవిత్వానికి స్వస్తి చెప్పాలి. ఇలా ఎడతెగని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడు ప్రభాకరం.

ప్రభాకరరావు పెద్దచదువేమీ చదువుకోలేదు గాని ఒకటి, రెండు 'పార్టు'లు ఇంటర్‌మీడియేట్ పూర్తిచేసాడు. ఎక్కడేనా ఓగుమాస్తాగిరి దొరికినాచాలు. కవిత్వంరాస్తూ కూర్చునే దానికంటె నయమే. ఓసారి తన అదర్శాలన్నీ గుర్తుకొచ్చాయి. తను కళాశాలలో చేరినక్రొత్తలోనే అప్పటికే తాను రచయితగా మంచి పేరు గడించాడు. అందరూ తనకొక ప్రత్యేకతను కలిగించేవారు. కాలేజి వక్తృత్వపు పోటీలలో తనదే పైచేయి. అందరూ తన ఆదర్శాలను మిగుల కొనియాడేవారు. అధ్యాపకులుసైతం 'ఇతడు' మా శిష్యుడు అని చెప్పుకొనేందుకే మిగుల గర్వించేవారు. పరిసర కళాశాలా వక్తృత్వపుపోటీలలోకూడ ప్రథమంగా నెగ్గుకొస్తూ అనేక 'మెడల్సు' సంపాదించాడు. అయినా యిప్పుడు తనకు మిగిలిందేమిటి? ఆ కీర్తి, అప్పటి 'మెడల్సు' తప్ప ఇప్పుడో తనపరిస్థితులు అన్నీ విషమించాయి. ఇప్పుడు తన ఆశయాలన్నీ ఏంగాను? తన ఆశలకంతంలేదా? అనుకున్నాడు తనలో.

ఆశయాలకు, ఆశలకు అర్థంలేనప్పుడు అంతంచేసుకోటమే మంచిది. రేపట్నుంచి పిల్లాడికి పాలుగావాలి. ఇంక ఎన్నెన్నోగావాలి. మరి అవన్నీ తన కెలాగు? 'వాడు' పెరుగుతున్నాడంటే 'వాడికి' కావలసిన వెన్నో వున్నాయి. మరి తను వాటిని సాధించేదెలాగు. తనకూ అనేక కోర్కెలున్నాయి. తనెలాగైనా తన పుత్రుడైనా తనలాంటి స్థితిలోకి రాకుండా జాగర్తపడాలి. అంటే తనేం చెయ్యాలి. ఏం చెయ్యాలన్నా తనకు అగమ్యగోచరంగావున్నది.

తన క్లాసుమేటు ఇప్పుడో పెద్ద కంపెనీ స్టార్టుచేసి జోరుగా నడుపుతున్నాడు. వాడూ తనవంటివాడే. వెనకేమీ పెద్ద ఆస్తివున్నవాడు కాడు. యుద్ధంలో రెండుడబ్బులు సంపాదించి యిప్పటి కంతవాడయ్యాడు. అయితే యేం? తనకుమల్లె యింత కవిత్వం రాస్తూ కూర్చోలేదు. తా నికనయినా కళ్ళుతెరవాలి. ప్రభాకరరావు ఆ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకోవాలి అనుకున్నాడు.

ప్రతిరోజూ ఏ పత్రికా ఎడిటరువద్దనుండో కథలు రావడంలేదేమని ఉత్తరం వచ్చేది. అన్నింటికీ ఒకటే సమాధానం. "నే నింతవరకూ తెలివితక్కువగా ప్రవర్తించాను. ఇక ముందలా వుండదల్చుకోలేదు" అని.

ప్రభాకరరావునిజూచి స్నేహితుడాశ్చర్యపడి "నీ కెందుకోయ్ ఉద్యోగం నాకంటే ఎక్కువే సంపాదిస్తుంటేనూ" అన్నాడు. ప్రభాకరరావు లోలోన నవ్వుకొని "లోగుట్టు పెరుమాళ్లు

తెరుక" అన్నాడు. "అంటే నువ్వేమీ సంపాదించటం లేదనా అర్థం" అన్నాడు స్నేహితుడు తనిదంతా నమ్మలేనట్టు. ప్రభాకరరావు నిస్సారంగా నవ్వి "అబ్బేలేదు!" అన్నాడు తాను నగ్నసత్యం పల్కుతున్నట్లు.

"అలా అంటావేమిటోయ్ — నీ కథలెంతో బాగా వుంటాయి. అదీగాక నీ కథలు చాలా పత్రికల్లో పడుతుంటాయ్. నువ్వలా నిరుత్సాహపడతావేమిటోయ్" అన్నాడు మిత్రుడు ఆశ్చర్యపడుతూ. "కథలు బాగుంటున్నాయ్ కనుకనే పత్రికలవాళ్లు వేసుకొంటున్నారు— చూచినవాళ్లు చదువుతున్నారు మెచ్చుకొంటున్నారు. నా సంగతి ఎవరికి గావాలోయ్" అన్నాడు ప్రభాకరరావు.

మిత్రుడు చాలా ఆశ్చర్యపడ్డాడు. అతని పరిస్థితిని సాకల్యంగా విన్నాడు. "మరి నేనొకటి చెబుతాను చేస్తావా ? అన్నాడు ప్రభాకరరావుని. "ఏమిటది?" నీ కెంత జీతం కావాలో అడుగు నే నిస్తాను" అన్నాడు మిత్రుడు మళ్లీ.

"ఓ! అలాగే అజీతమే నాకు కావలసింది" తరువాత ఆత్మవంచన అని బాధపడకూడదు అవి యెప్పుడో మొహం మొత్తాయి" అన్నాడు ప్రభాకరం.

"అయితే నీకెంత జీతంకావాలి"

"నే చేయబోయేపనినిబట్టి చెబుతాను"

"ఏమీలేదు. నీకు కావలసిన పరిస్థితులన్నీ సరిపోయేలా యిల్లొకటిస్తాను వుండు. నీవురాసిన కథలన్నీ నా కిచ్చెయ్యాలి" అన్నాడు మిత్రుడు. ప్రభాకరరావుకి మిత్రుని ఆలోచన అర్థమవలా.

"ఆలోచించిన తర్వాత విచారపడ్తావేమో!" అన్నాడు.

"దాన్నిగురించి నేనేం బాధపడను. ఎంత యిమ్మంటావో అడుగు" అన్నాడు మిత్రుడు.

"నెలకు రెండువందలు" అన్నాడు ప్రభాకరరావు నిర్మోహమాటంగా.

నెలకు రెండు వందలే! అని అంటాడేమోనని అనుకున్నాడు ప్రభాకరం. కాని అతగాడు "సరే" అన్నాడు నిర్లిప్తతగా.

ప్రభాకరరావు చాల ఆశ్చర్యపడిపోయాడు. మిత్రుడికేమయినా మతి చలించిందా అనుకున్నాడు. లేక మిత్రుడి కోరికలో యింకేదైనా అంతరార్థం వుందా? అని అనుకున్నాడు. ఏదేమయినా ప్రభాకరరావుమాత్రం చాల ఉత్సాహపడ్డాడు. వారి మిత్రత్వం మరీ ఘనిష్టమయింది. "విధి"చెయిదానికి విస్తుపోయాడు ప్రభాకరరావు.

ఇప్పుడు ప్రభాకరరావు జీవితం చాలా సాఫీగా సాగుతోంది. తనకు జరగదన్నదిగులు లేదు. తన యిష్టంవచ్చినట్లుగా రాసుకోవచ్చు ఆడిగేవారులేరు—ఆర్థికబాధ లసలేలేవు, తన నికృష్టజీవితం మాసిపోయింది. పూరిపాక పోయి యింద్రభవనంలాంటి మేడలో కాపురముంటున్నాడు. తనకు తనపేరుమీదనే విరక్తి గలిగింది. సిమెంటురోడ్డుమీది కారులా తన జీవితం సాఫీగా జరిగిపోతోంది. తన ఆశలు క్రొత్తచిగుళ్లు చిగిరించాయి. తన జీవితంలో నవ వసంతం ప్రారంభమైందనుకొన్నాడు.

ప్రస్తుతం కథలన్నీ తనపేరిట ప్రచురింపబడటంలేదు. తన మిత్రుడు పేరుమీదుగా ప్రచురింపబడుచున్నాయి. వాటిని చూచి ప్రభాకరరావు నవ్వుకొనేవాడు తనలోనే. తన స్నేహితుడికి దానివల్ల వచ్చే ఆర్థికలాభం ఏమీ లేదని తెలుసు. వెధవపేరుకోనం తన స్నేహితుడు తనకు నెలకు రెండు వందల రూపాయలు జీతం — అన్ని హంగులతో గూడిన యిల్లూ యిచ్చాడు. ఒకొక్కసారి పరిస్థితులు మహా విచిత్రంగా మారుతుంటాయ్.

ప్రభాకరరావుమాత్రం తనకు ఆర్థికస్తోమత చిక్కిందికదా అని బద్ధకించడంలా. తను మిగుల కృషిచేస్తూ కొత్తకొత్త కళాఖండాలను సృష్టిస్తూనేవున్నాడు. తనకు చిక్కిన యీ ఆర్థికస్థితివల్ల సాహిత్యలక్ష్మికి కొత్తతొడుగులు తొడుగుతున్నాడు. ప్రభాకరరావుపేరు అడుగున పడిపోయింది. కాని అతనికథలుమాత్రం బాహాటంగా ప్రచురితమవుతున్నాయి. కాని తన స్నేహితుని పేరుమాత్రం వాడకంలో వున్నది. స్నేహితుడు పుస్తకాలు ఒక్కొక్కటే ప్రచురించుకోసాగాడు. ఆధునిక భావాలు లేవన్న పెద్దమనుషులు సైతం ఆ పుస్తకాల కెగబడుతున్నారు. తన స్వంత డబ్బుతోనే స్వంత ప్రచురణాలయం స్థాపించాడు. ఆ ప్రచురణపేరుక్రింద ప్రభాకరరావు పుస్తకాలన్నీ స్నేహితుడి పేరుమీదుగా ముద్రింపబడుతున్నాయి.

ప్రభాకరం నిజానికి ఏమీ బాధపడలేదు. తనకూ్కడా డబ్బుంటే తనూ అలాచేసేవాడే. కానీ తనకా స్తోమతలేదుగా. తను ఒకడికి అమ్ముడుపోయినతర్వాత విచారపడడం అనవసరం అనుకున్నాడు. కాగా స్నేహితుడు తనకో వంద రూపాయలు జీతంకూడ పెంచాడు. "అమ్మో" అనుకున్నాడు ప్రభాకరం తనలోనే.

పూర్వం, తను అన్ని పుస్తకాలు రాసినా ఏ ఒక్కరూ ప్రచురించడానికి సాహసించబోయేసరికి ప్రభాకరరావు మిగుల దుఃఖించాడు. తన గ్రంథాలన్నీ బూడిదపాలు కావలసిందేనా! అని. కాని ఆ కోరిక యిప్పుడు తీరింది. ఎవరిపేరుమీదుగానైతేనేం తన పుస్తకాలు యిప్పుడు ప్రచురితమవుతున్నాయి. తన సాహిత్యలక్ష్మిశృంఖలాలు విడిపోయాయి. బజారులలో ఏ మూల చూసినా అవే పుస్తకాలు బ్రహ్మాండంగా ప్రజాదరణ పొందుతున్నాయి.

ఓ రోజున ఓ పేపరులో పెద్దపెద్దఅక్షరాలతో తన స్నేహితుడికి ప్రపంచకథానికల పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందని వుంది. దానికి బహుమతి ఏబది వేల రూపాయలనీ వుంది. ప్రభాకరరావుకళ్ళు జిగేలుమని మెరిశాయి. తనపేరిటే ఆ కథ పడివుంటే ఆ యాభై వేలు తనకే వచ్చివుండేవి. తనెంతకాలం సంపాదిస్తే యాభై వేలు తన జీవితమంతా వెచ్చించినా అంత సంపాదించ లేననుకొన్నాడు ప్రభాకరం.

స్నేహితుడు లోనకు ప్రవేశించి "ఇదుగో నోయ్! మన కథకు ప్రపంచకథానికలపోటీలో ప్రథమ బహుమతి వచ్చింది" అని నవ్వుతూ ప్రభాకరం ముఖంలోకి చూచాడు. మిత్రుడు తనునుంచి కూడ నవ్వు Expect చేస్తున్నాడని తెలుసుకొని ప్రభాకరరావు ఎంతో ప్రయత్నంమీద నవ్వగలిగాడు. కాని ఆ నవ్వుకూడ ఏడ్చినట్లే వుంది.

ఆరోజే పురజనులంతా టౌనుహాలులో పెద్ద సభ జరిపి స్నేహితుడ్ని ఆహ్వానించి మెడనిండా పూలదండలతో నింపి పెద్దపెద్దవారంతా పెద్దపెద్ద ఉపన్యాసాలిచ్చారు.

నిజంగా ప్రభాకరరావు తనమిత్రుడికి యాభై వేలు వచ్చాయన్నా సరిపెట్టుకున్నాడు గాని తన మిత్రుడికి జరిగిన యీ సత్కారం విషయంలోమాత్రం తన ఒంటినిండా తేళ్ళూ, జెఱ్ఱులూ ప్రాకుతున్నట్లే బాధపడ్డాడు. తనలో తనే అనుకున్నాడు. "కష్టం ఒకరిది, ఫలితం మరొకరిది" అని.

సభకు హాజరయిన ప్రజానమూహపు వెనకెక్కడో ఒకమూల చీకట్లో నిలబడి ప్రభాకరరావు ఎలక్ట్రిక్ లైట్లకాంతిలో మెరిసిపోతున్న స్నేహితుడ్నిచూసి "గ్రుడ్డిలోకం" అని గొణుక్కున్నాడు గాని మళ్లీ ఆ పూరిగుడిశెలోనే వుండాలన్న సంగతి గుర్తుతెచ్చుకొని అందుకు సాహసించలేకపోయాడు. ★